

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎపి మోడల్ స్కూల్ లో మిగిలిన సీట్లు భర్తీ కోసం ఆన్లైన్ దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి ప్రకటించారు. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతితో పాటు 7,8,9, ఇంటర్ మొదటి ఏడాదిలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రకటన చేశారు. వీటి కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని. ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేందుకు జూన్ 5 నుంచి 20 వరకు అవకాశం కల్పించిందని. ఆన్ లైన్లో 10 నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 24న నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న విడుదల చేయబడును. 26న ధ్రువపత్రాలను పరిశీలించబడతాయని, మరిన్ని వివరాలకు పాఠశాల పనివేళల్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేటి నుంచి డిఎస్‌సి పరీక్షలు

- 583 పోస్టులు.. 36,495 దరఖాస్తులు
- పకడ్బందీగా ఏర్పాట్లు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



సబ్జెక్టుల వారీ వచ్చిన దరఖాస్తులు	
ఎస్‌జిటి	7171
ఎస్‌ఎ తెలుగు	987
ఎస్‌ఎ లెక్కలు	1643
ఎస్‌ఎ పిఎస్	2783
ఎస్‌ఎ బయోలిజి	1826
ఎస్‌ఎ సోషల్	2821
పిఇటి	1414
పీడీ	1541
ఇంగ్లీష్	2464
పీజీటీ	11,773

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే మెగా డిఎస్‌సి నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 30వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులకు సుమారు 36,495 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒకే పరీక్ష రాసే వారు 18,002 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. సీతం కాలేజీలోని ఐయాన్ ఐయాన్ డిజిటల్‌సెంటర్, లెండి ఇంజినీరింగ్, ఎంవిజిఆర్ ఇంజనీరింగ్, అవంతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని ఇప్పటికే అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాలవద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీప్ సూపరింటెండెంట్, సిటింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసారు. అన్ని పరీక్షా పరీక్షా కేంద్రాలవద్ద వైద్య శిబిరాలు, తాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

తప్పులు సరిదిద్దుకొనే అవకాశం ఉంది

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకొనే అవకాశం ఉందని, వాటికోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం స్పష్టం చేసింది. ఏదైతే తప్పు నమోదయ్యిందో, దానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికేట్‌ను చూపించి, ధ్రువీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రంవద్దే సరిచేసుకూనే అవకాశం కల్పించారు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం



ఉపాధ్యాయ నియామక డిఎస్‌సి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు ప్రశాంతంగా రాసుకునే విధంగా అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాం. గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ సదుపాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం.

- డిఇఒ మాణిక్యం నాయుడు, విజయనగరం.

సీతంపేటలో భారీ ఎత్తున యోగా

ప్రజాశక్తి - సీతంపేట

యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రదేశాల్లో నిర్వహించే యోగా కార్యక్రమం గురువారం స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పెద్దఎత్తున నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో సహా 14 వందల మంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాంధ్రాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి రోజు గంట సేపు యోగా చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. శరీరానికి అవసరమైన శక్తి యోగా వల్ల కలుగుతుందని తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ వస్తున్నారని, యోగాంధ్రా ముగింపు దినోత్సవాన్ని ప్రధాని సమక్షంలో జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పిఒ మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటుందన్నారు.



యోగా చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే , పిఒ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. నిషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగ నివారణపై అవగాహనకు వాక్ థాన్ కార్యక్రమం సీతంపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమక్షంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దృక్పదంతో యువత, మహిళలు, విద్యా సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో భారీ స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు, జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి కవిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు, పిహెచ్ఒ గణేష్, ఎంపిడిఒ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అధిక ఆదాయం... పైనాపిల్ పెంపకం :

పైనాపిల్ పెంపకం వల్ల రైతులకు అధిక ఆదాయం సమాకూరుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని బిల్లమడలో 75 ఎకరాల్లో కేరళ మార్షెస్ రకం పైనాపిల్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. 358 మంది రైతులు ప్రయోగాతకంగా పండించిన పైనాపిల్ పంటను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను అభినందించారు. అధిక నిల్వ సామర్థ్యం, జ్యూసీ రకమని ఇది ఎక్కువ దూరం రవాణకు చేసినా నాణ్యతగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పైనాపిల్ పెంపకం ద్వారా రైతులకు ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎస్‌వి గణేష్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎపిఒ జి. చినబాబు తదితరులు పాల్గొన్నారు.



హాస్పటల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిని గురువారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సందర్శించారు. అక్కడ రోగులు పొందుతున్న సేవలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి గది క్షుణంగా పరిశీలించారు. ఎండోస్కోప్ విధానం చూశారు. కొత్త భవనం రెండు నెలల్లో పూర్తి చేయాలని సంబంధించిన ఇంజనీర్లను ఆదేశించారు. కొత్త భవనం పూర్తయితే ఇంకా మంచి సేవలు అందించవచ్చన్నారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణం చూసి సంతృప్తి వ్యక్తం చేవారు. కలెక్టర్ వెంట పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ నిర్వహణా పనులు చేపట్టడం ద్వారా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బడే శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గరుగుబిల్లితో పాటు గొట్టివలస, గొల్లవానివలస, తులసిరామినాయుడువలస, మరుపెంట, దలాయివలస, బురదవెంకటాపురం, పెద్దూరు, చినగుడబ, పెదగుడబ, వల్లరిగుడబ, సన్యాసిరాజుపేట, కొత్తపల్లి, శివ్వాం, సీమలవానివలస, పోలినాయుడువలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ : పిఒ

ప్రజాశక్తి-పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, వసతి గృహ సంక్షేమ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లోకి విద్యార్థుల నమోదు డ్రైవ్ చేపట్టాలన్నారు. పాఠశాల ప్రాంగణాలను శుభ్రపర్చడం, తరగతి గదుల నిర్వహణ, చిన్న పాటి మరమ్మతులు చేపట్టడం, అన్ని ఐటి పరికరాలు సరిగ్గా పనిచేసేలా చూసుకోవడం, నీటి ట్యాంకులను శుభ్రపరచడం వంటికి పాఠశాల సంసిద్ధతపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఐఎఫ్‌పి ప్యానెల్లు , ఇతర డిజిటల్ ప్లాట్‌పాంలను సమర్థవంతంగా పనిచేసేలా అందుబాటులోకి తీసుకొచ్చి, వాటిని తప్పనిసరి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరికరాలను విద్యా కార్యకలాపాలకు సరిగ్గా ఉపయోగించుకోవాలని తేల్చి చెప్పారు. పాము కాటు, ఇతర విషపూరిత కీటకాల నుంచి పిల్లలను రక్షించడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రవేశ సమయంలో ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం, స్థానిక పిహెచ్‌సిలు సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడానికి ఈ ఆరోగ్య పరీక్షలను ప్రతి పక్షం రోజులకు ఒకసారి పునరావృతం చేయాలని తెలిపారు. పాఠశాల అధిపతులంతా విద్యార్థుల ఆరోగ్య కార్డులను నిర్వహించాలని, అనారోగ్యంతో ఉన్న బోర్డింగ్ విద్యార్థులను వారు పూర్తిగా కోలుకునే వరకు లేదా చికిత్స పూర్తి చేసే వరకు ఇంటికి పంపకూడదని స్పష్టం చేశారు. వారికి ప్రత్యేక ఆహారం, సరైన సౌకర్యాలతో కూడిన ప్రత్యేక 'హెల్త్ రూమ్' నిర్వహించాలన్నారు. అనారోగ్యంతో ఉన్న బోర్డింగ్ విద్యార్థుల వివరాలు, అందించిన చికిత్స, ఇచ్చిన మందులను నమోదు చేయడానికి అన్ని పాఠశాలల్లో సిక్ బోర్డింగ్ విద్యార్థుల రిజిస్టర్‌ను నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు డిఎంహెచ్ఒ సమన్వయంతో విద్యార్థులకు సికిల్ సెల్, అనీమియా పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అలాగే సురక్షితమైన తాగునీటిని అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత నిర్వహించాలని సూచించారు.



ప్రిన్సిపాళ్లు, గిరిజన సంక్షేమాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ

మరుగుదొడ్లు, తరగతి గదులు, భోజన ప్రదేశాలు, క్వార్టర్లు, హాస్టళ్ల నిర్వహణతో సహా రోజువారీ శుభ్రపరిచే దినచర్యలను ఖచ్చితంగా అమలు చేయాలని, క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తేల్చిచెప్పారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రభావవంతమైన ఫలితాలను సాధించడానికి వచ్చే విద్యా సంవత్సరం నుండి అన్ని సంస్థల్లో సూపర్ 50 మోడల్ అమలు చేయాలని అన్నారు.

బాలికల విద్యాలయాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేసి, విద్యార్థుల భద్రత, నిఘాను ఉంచాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి నోడల్ అధికారిని నియమించడం తప్పనిసరి అని, జిల్లా అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బయట వ్యక్తులను ప్రాంగణంలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడానికి, సమర్థవంతమైన విద్యను అమలుచేసేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, ఉప విద్యాశాఖాధికారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు, గిరిజన సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, వసతి సంక్షేమ అధికారులు, సహాయ వసతి సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ యత్నంలో కలెక్టర్?

అధికారపార్టీ నేతల ఒత్తిళ్లే కారణమనే ప్రచారం

ఏడాది కాకముందే బదిలీ యత్నాలు

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బదిలీయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది కూడా పూర్తి కాలేదు. గత ఏడాది జూలైలో ఆయన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంత తొందరగా ఆయన బదిలీకి తెరవెనుక ప్రయత్నాలు చేయడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతోంది. చిన్న జిల్లా కావడంతో పాటు జిల్లాలోని కొంతమంది అధికారపార్టీ నేతల మితిమీరిన ఒత్తిళ్లే కారణమనే ప్రచారం సాగుతోంది. జిల్లాలో కీలకమైన పదవిలో ఉన్న ఒక ఎమ్మెల్యే చీటికీ మాటికీ రాష్ట్ర స్థాయి నేతలతో ఫోన్లు చేయించడం తలనొప్పిగా మారింది. తనకు ఇష్టమైన వ్యక్తులు ఎంత పెద్ద తప్పు చేసినా వారిపై చర్యలు తీసుకోవద్దని కోరడం, ఒకవేళ జిల్లా అధికారి వినకపోతే రాష్ట్ర స్థాయి నేతలతో ఒత్తిడి చేయడం పరిపాటిగా మారింది. అదే విధంగా తనకు ఇష్టం లేని ఉద్యోగులు లేదా అధికారులపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేయడం అధికారపార్టీకి చెందిన కీలక పదవిలో ఉన్న ఆ నేతకు అలవాటుగా మారుతోంది. అంతే కాకుండా జిల్లాలో మరో అధికారపార్టీ ఎమ్మెల్యే వ్యవహారశైలి కూడా తలనొప్పిగా పరిణమించింది. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన దుందుడుకు వైఖరి వివాదాస్పదమవుతోంది. ఆయన కూడా పదేపదే వివాదాస్పద అంశాల్లో తలదూర్చి తనకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండడంతో జిల్లా బాస్‌కు మింగుడు పడని వ్యవహారంలా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పని చేయడం కన్నా బదిలీ చేయించుకోవడమే ఉత్తమమనే నిర్ణయానికి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి కలెక్టర్ నిషాంత్ కుమార్ దాదాపు రెండున్నరేళ్ల పాటు పని చేశారు. ఆయన తర్వాత బదిలీపై వచ్చిన శ్యామ్ ప్రసాద్ ఏడాది కాకముందే బదిలీ యత్నాలు చేయడం చర్చనీయాంశమవుతోంది.



రైల్వేట్రాక్ పనులతో నిలిచిపోయిన ట్రాఫిక్

ట్రాక్ మరమ్మతు పనులతో స్తంభించిన ట్రాఫిక్

నాలుగు గంటల పాటు నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

ప్రజాశక్తి కొమరాడ

మండలంలోని ఉన్న రైల్వే గేట్లతో ఇప్పటికే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ట్రాక్ మరమ్మతు పనులతో వాహనదారులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయం నుంచి అర్తాం రైల్వే గేట్ వద్ద ట్రాక్ మరమ్మతు పనులు రైల్వే అధికారులు ప్రారంభించారు. దీంతో సాయంత్రం ఐదు గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడిస నుంచి ఆంధ్రాలోకి వచ్చే వాహనాలతో పాటు ఆంధ్రా నుంచి ఒడిస్సా వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు రెండువైపులా అయిదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు అర్తాం నుంచి కొత్తవలసకు జంఝావతి కాలువ గట్టుపై నుంచి రాకపోకలు కొంతమేరకు సాగించారు. లారీలు, బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు అధికారులు రాత్రి సమయంలో చేసుకుంటే ఇంత ఇబ్బందులు లేకుండా ఉండేవని పలువురు ప్రయాణికులు అంటున్నారు. ఇకనుంచైనా ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ఉండేలా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో సర్వే

ప్రజాశక్తి - సీతంపేట

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) సర్వే కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. హడ్డుబంగి, మెట్టుగూడ, మొగదార తదితర గ్రామాల్లో సర్వే చేయడంతో పాటు, పిఎం జన్ మాన్ కింద జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎ జెజియుఎ అవగాహన కార్యక్రమాలకు సిద్ధం కావడం జరుగుతుందన్నారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. జూన్ 14 నాటికి గిరిజనులకు ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులకు కావాల్సిన అవసరాలను గుర్తించి నివేదిక సిద్ధం చేసి, ధ్రువపత్రాలను జారీ చేయాలని ఆయన ఆదేశించారు. డిఎ జుగా నిర్వహణ పట్ల సంబంధాలతో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని చెప్పారు. గ్రామ స్థాయి / క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు ఉద్దేశించడం జరిగిందని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలను ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కలిగిందుకు జూన్ 15 నుంచి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వివిధ రకాల సేవలను అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎపిఒ జి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

తోట పల్లి, జంఝావతి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి మన్యం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్పష్టం చేశారు. మండలంలోని గాదెల వలసలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన విత్తనాలను ఎమ్మెల్యే రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వేదికల వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ, ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే నగదు అందించిందన్నారు. అవసరమైన ఎరువుల సరఫరా, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టి రైతు పక్షపాతిగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విరివిగా మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు అందిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



జెజెఎం ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలిస్తున్న కేంద్రకమిటీ సభ్యులు

ఇంటింటికీ తాగునీరే లక్ష్యం

కేంద్ర పరిశీలన బృందం సభ్యులు తరుణ డోలియా

ప్రజాశక్తి- గరుగుబిల్లి

గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జలజీవన్ మిషన్ కేంద్ర పరిశీలన బృందం సభ్యులు, కామర్స్ ఇండస్ట్రీ డైరెక్టర్ తరుణ డోలియా అన్నారు. మండలంలోని చినగుడబ పంచాయతీ గదబవలసలో జెజెఎం నిధులు రూ.8.8 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథక నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల సైతం ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకంలో నిధులను మంజూరు చేసిందన్నారు. నిధుల వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.అనంతరావు, మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపిడిఒ జి.పైడితల్లి, తహశీల్దార్ పి.బాల, డిప్యూటీ ఎంపిడిఒ ఎల్.గోపాలరావు, ఆర్ డబ్ల్యూఎస్ జెఇ గౌరీశంకరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

సాలూరు : వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో చేపట్టిన నిరసన ర్యాలీ ఊహకందని రీతిలో ప్రజలు విజయవంతం చేశారని చెప్పారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చేపట్టనున్న పోరాటానికి ఇదే తరహాలో ప్రజలు సహకరించాలని రాజన్నదొర కోరారు.

పంచాయతీ రిసోర్స్ కేంద్ర నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి – పార్వతీపురం

పార్వతీపురంలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ రిసోర్స్ కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవన నిర్మాణం నాణ్యంగా ఉండాలని నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. ఆయన వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

9న సమ్మెలోకి వెళ్తున్నాం

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

ఈనెల 9 నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లయి, విద్యుత్ వీధి దీపాల నిర్వహణ విభాగంలో పనిచేసే కార్మికులు మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రూ.13,080, రూ.16,400 చొప్పున ఇంజినీరింగ్, తాగునీటి సరఫరా ఉద్యోగులకు వేతనాలు వస్తున్నాయని, అవి చాలడం లేదని, దీనివల్ల పిఎఫ్ డబ్బులు వాడుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆధార్ నెంబర్ కొడితే గవర్నమెంట్ ఉద్యోగులుగా చూపిస్తుందని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, ఉచిత గ్యాస్ విద్యుత్ సబ్సిడీ, మాకు రావడంలేదని, వేతనాలు పెంచి, తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిచో విధులకు హాజరు కాలేమని అన్నారు. వినతిని అందజేసిన వారిలో టి.విజయ్, బి.ఉమామహేశ్వరరావు, వై.శంకర్రావు, ఎం.రమేష్, బి.జగదీష్, పి.రమేష్, అప్పలరాజు, బాల, తదితరులు పాల్గొన్నారు.

తమ్మినాయుడు కాలేజీ విద్యార్థులకు అవార్డులు

ప్రజాశక్తి – పాలకొండ

ఇంటర్ –2025 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం వారిచే గుర్తించబడి షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు తమ్మినాయుడు కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. బైపిసికి చెందిన కొనాడ ప్రహర్షిణికి 985 మార్కులు రావడంతో అవార్డుకు ఎంపికయ్యారు. బైపిసికి చెందిన అరాధల సాహితీసిరికి 982 మార్కులు, హెచ్ఇసి గ్రూపులో 869 మార్కులు సాధించిన కలివరపు ప్రవంతి ఎంపికయ్యారు. ఈ ముగ్గురు విద్యార్థులు, వారి తల్లి తండ్రులతో కలిసి ఈ నెల 9న కలెక్టర్ చేతుల మీదుగా ఈ ప్రతిభా అవార్డులను అందుకోనున్నారు. తమ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ శెట్టి నారాయణప్ప, కాలేజీ ప్రిన్సిపల్ ఎ.తిరుపతిరావు, ఇన్‌ఛార్జి అనిల్ కుమార్, సిబ్బంది అన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

78 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి – వీరఘట్టం

మండలంలోని వండవ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నేత్ర వైద్యులు ఆధ్వర్యంలో 78 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సల కోసం విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, ఆలయ నిర్వాహకులు ఎం.సింహాచలం, నేత్ర రోగులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఆలయ నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ప్రజాశక్తి –గరుగుబిల్లి

భావితరాల భవిష్యత్ బాగుండాలి అంటే ప్రకృతి వ్యవసాయం చేయడం మంచిదని ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖ రాజు అన్నారు. మండలంలోని దళాయివలసలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ రెండో రోజు ఆర్‌టిఐ జి.హేమసుందరావు నీటి సదుపాయం లేని చోట 365 రోజుల పంటలు ఎలా పండించ గలం అనేది ఫీల్డ్‌లో చూపించి వివరించారు. పార్వతీపురం ఎఎ వెంకటరావు ఎటిఎం ఎ-గ్రేడ్ మోడల్ వేసుకోవడం వల్ల లాభాలు నిరంతరం వస్తాయని, భూమి మంచిగా మారుతుందని అన్నారు. కొమరాడ ఎంఎల్ శంకరరావు మాట్లాడుతూ గతంలో సహజ ఎరువులు వాడి పంట పండించి, వారి జీవన ప్రమాణం సుమారు 120 ఏళ్లు బతికేవారని, నేటితరం పురుగుల మందులు, రసాయన ఎరువులు వాడడం వల్ల రకరకాల రోగాలు వచ్చి 50 ఏళ్లకే చనిపోతున్నారని అన్నారు. స్థానిక ఎఒ విజయ భారతి మాట్లాడుతూ పిఎండిఎస్ వేయడం వల్ల ఎరువులు, పురుగు మందులు వాడకం చాలా వరకు తగ్గించవచ్చును. కార్యక్రమంలో స్టేట్ టీమ్ మెన్టార్, హెచ్ఎ జయశ్రీ, తదితర సిబ్బంది, మహిళా సంఘాల రైతులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన పల్లె రహదారులు

ప్రజాశక్తి – వీరఘట్టం

మండలంలోని అడపాదడపా కురుస్తున్న వర్షాలు కారణంగా పల్లె రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. మండలంలోని బిల్లగూడ, కాశీతాడ, గడబవలస, ఎంఏ పురం, కె.ఇచ్చాపురం, రామాపురం, బల్లగుడ్డ, రాయిమానుగూడ, పాలగూడ తదితర గ్రామాల రహదారులు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా తయారవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పల్లె ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల 108, 104 వాహనాలు వచ్చే దాఖలాలు కూడా కనిపించక పోవడంతో, గర్భిణులకు సరైన వైద్య సౌకర్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్పందించి తమ గ్రామాల రహదారులు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి – కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. మండల కేంద్రానికి సమీపంలో గల మాంగురూడ జంక్షన్ వద్ద గురువారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా అపరాధ రుసుం కట్టనటువంటి వారిని వెంటనే కట్టించి, ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. అనంతరం రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ కూడా ధ్రువీకరణ పత్రాలు ఉండి ద్విచక్ర నడిపేవారు హెల్మెట్ ధరించి రహదారి భద్రతా నియమాలు పాటించి మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలే మనిషికి ప్రాణవాయువు



మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి – సీతంపేట

మనిషి మనుగడకు మొక్కలే ప్రాణవాయువని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం సీతంపేట ఉద్యానంలో ఏర్పాటు చేసిన వనం–మనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వనం మనం కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా సొంత కార్యక్రమంగా జరుపుకోవాలని అన్నారు. ప్రజలు, స్థానిక స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో పచ్చదనాన్ని మెరుగుపరచడానికి వనం మనం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ఇంటి ఆవరణలోనూ, బయట బహిరంగ ప్రదేశంలోను మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతలో మార్పు తీసుకురావాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా మనిషి మనుగడ సాధ్యపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని కోరారు. అనంతరం సుమారు 180 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలను రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎపిఒ జి. చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.ప్రభాకరరావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో గోటివాడ పంచాయతీలో గల తేనుఖర్జలో ఎస్ సొసైటీ, అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మొక్కలు నాటారు. అనంతరం ఎస్.సొసైటీ వారు తయారు చేసిన పర్యావరణ సంచులను అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, తహశీల్దార్ ఎం.రవణమ్మ, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, సిడిపిఒ కె.విజయగౌరి, అటవీ శాఖ రేంజర్ గంగరాజు, ఎఎంసి చైర్మన్ మాజీ కోలా రంజిత్‌కుమార్, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో...



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో లోక్ అదాల సభ్యులు గోటారి వెంకటరావు, పారా లీగల్ వాలంటీర్ అంధవరపు కోటేశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హై స్కూల్‌లో వ్యవసాయ అధికారి తిరుపతిరావు, హెడ్మాస్టర్ ప్రభాకరరావులతో కలిసి హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలోని పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన పరిసరాల పరిశుభ్రత, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించినప్పుడే కాలుష్య నివారణ సాధ్యపడుతుందని తెలిపారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతుమూరులో...

మండలంలోని మాతుమూరులో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ ఆ గ్రామ సచివాలయ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మరడ రాముతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ టిడిపి నాయకులు ముఖీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిఇఐసి ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతకు చెందిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడి, ఆర్బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ పిఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు డాక్టర్ భరత్ చంద్ర, డాక్టర్ లలిత దుర్గ, ఫిజియోథెరపిస్టు లక్ష్మీనారాయణ, సిసి శ్రీనివాసరావు, తాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ ఆధ్వర్యాన

మండలంలోని కవిటిభద్ర కస్తూరిబా పాఠశాల ఆవరణలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, డిప్యూటీ ఎంపిడిఒ రమణమూర్తి, కార్యదర్శి జయలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బలిజిపేట మండలం అరసాడ, సీతానగరం మండలం గాదెలవలసలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మొక్కలు నాటారు. భవిష్యత్ తరాల కోసం చెట్లను పెంచి పర్యావరణాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. మొక్కలు నాటడం, వాటిని పెంచడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రశాంత్ కుమార్, ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎపిఒ బాలకృష్ణ, ఇఒపిఆర్‌డి వర్మ, నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి ఆర్.కృష్ణవేణి, ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఒ డి.వెంకటరమణ, ఎపిఒ జి.సత్యంనాయుడు, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణి దుర్గ, హౌసింగ్ ఎఇ వినోద్ కుమార్, సీనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ కన్సల్ట్ కృష్ణప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని లుంబూరులో మొక్కలు నాటే కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ మన్మధరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ రంగారావు, గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక పాఠశాలను, అంగన్వాడీకేంద్రం, రేషన్ డిపోలు పరిశీలించారు. కోనేరు చుట్టూ గతంలో నాటిన సుమారు 30కి పైగా కొబ్బరి చెట్లు



సాలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ స్వామిబాబు, సచివాలయ ఉద్యోగులు అమిత్ పాడి, సరోజినీ దేవి, భవాని శంకర్, హెల్త్ అసిస్టెంట్లు,గ్రామ యువకులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ జంక్షన్ వరకు, మహిళా మండలి సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టి, హరిత ఆంధ్ర ప్రదేశ్ కొరకు ప్రతిజ్ఞ నిర్వహించారు, అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ, అటవీ శాఖ వారు స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ. ప్రసాద్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ సిబ్బంది, మహిళా మండలి సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుగుబిల్లి : మండలంలోని గరుగుబిల్లి, చినగుడబ, పెద్దూరు తదితర గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెజెఎం కేంద్ర పరిశీలన బృందం సభ్యులు తరుణ డోలియా, డి.అనంతరావు, ఎంపిడిఒ జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపిడిఒ ఎల్.గోపాలరావు తదితరులున్నారు.

నాటిన దేవతా వక్షాలు

తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ సలురకాల దేవతా వృక్షాలు నాటారు. ఆలయ ప్రాంగణంలో దేవతా వృక్షాలుంటే ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వివి అప్పలాచార్యులు, సిబ్బంది, టిటిడి ట్రస్టు సభ్యులు ఉన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చి, పని భారం పెంచిన ప్రభుత్వం, నిర్వాహకులకు వేతనాలు పెంచాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డివిఎం స్కూల్ ఆవరణలో మండల విద్యాశాఖ నిర్వహించిన మధ్యాహ్న భోజన నిర్వాహకుల సన్నాహక సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు తమ సమస్యలపై ఎంఇఒ వై.విమలకుమారికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకంలో అనేక మార్పులు ప్రవేశపెట్టిందని ఆ మార్పులకు అనుగుణంగా, నిర్వాహకులకు పెరిగిన పని భారానికి తగిన విధంగా పారితోషకం పెంచడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కేవలం రూ.3వేల పారితోషకంతో నిర్వాహకులు పనిచేస్తున్నారని, రోజురోజుకు ధరలు పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో ఆ వేతనం ఏమాత్రం చాలడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు వేతనం రూ.10వేలకు పెంచాలని, విద్యార్థులకు ఇస్తున్న రేషన్ సరుకులు సరిపడినన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేయాలని, లేనిచో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు తులసి, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం నాయకులు



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు

డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ శ్యామసుందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం కార్మికుల ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి జి.కృష్ణారావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై కార్మిక వర్గం ఎన్నో ఆశలతో ఉందని నాలుగు నెలల జీతాలు రెండు నెలల బిల్లులు నేటికీ అందకపోవడం వల్ల వంట నిర్వాహకులంతా అప్పుల పాలవుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. నిర్వాహకులకు ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డులు, యూనిఫారం టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. భోజన నిర్వాహకుల పట్ల నిర్లక్ష్యం విడనాడి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని, ఈ డిమాండ్‌తోనే జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఎం.కృష్ణ, జి.పార్వతి, కోట కమలమ్మ, చింతల పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి – సీతంపేట

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలకు అవకాశం ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటిఐని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో స్కిల్ హబ్లను ఏర్పాటు చేశామన్నారు. సీతంపేట మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శాంప్లింగ్ టైలర్ కోర్సులను ప్రారంభించామని, ఇందులో శిక్షణ తీసుకుంటున్న 30 మంది అభ్యర్థులను కలిసి శిక్షణకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ తరాల కోసం నైపుణ్యం, వృత్తి విద్యను పెంపొందించే లక్ష్యంతో శిక్షణ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామిక శిక్షణా కేంద్రాలు యువతకు ఉద్యోగావకాశాలను పొందడానికి సహాయపడతాయని, పారిశ్రామిక శిక్షణ ద్వారా, యువతకు వివిధ కంపెనీల్లో పనిచేయడానికి, ఉజ్వలమైన భవిష్యత్‌ను పొందడానికి అవసరమైన శిక్షణను పూర్తి చేసి మంచి ఉద్యోగాలను సంపాదించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌పై ఆర్‌డి విచారణ

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లపై పట్టణానికి చెందిన పలువురు చేసిన ఫిర్యాదులను విచారించేందుకు రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర గురువారం విచారణ చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్లో ఫిర్యాదుదారులను ఒక్కొక్కరిగా సుమారు మూడు గంటల విచారించి, పలు విషయాలను అడిగి రికార్డు చేశారు. అనంతరం రీజనల్ డైరెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ మే నెల 15న పార్వతీపురం మున్సిపల్ కార్యాలయ సందర్భంగా వచ్చిన తనకు మాజీ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు గొర్లి వెంకటరమణ ఆశీలు వేలంపాటకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం పొందలేదని, కలెక్షన్ పుస్తకాలపై మున్సిపల్ స్టాంప్ వేయకుండానే డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆదర్శ రూరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థకు సంబంధించిన రేజేటి దయ నైట్ షెల్టర్ నిర్వహణకు కౌన్సిల్ ఆమోదం పొందినా ఇంతవరకూ ఆర్డర్ ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. ఎపి ఎన్జీవో హోం భవనానికి ట్యాక్స్ వేయలేదని ఫిర్యాదులు చేశారని, దీంతో పాటు సిడిఎంఎ కార్యాలయం నుంచి కూడా ఫిర్యాదు వచ్చిందన్నారు. అలాగే పట్టణ పౌరు సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఎక్కువ అవుతున్నాయని, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల సంబంధించి ఆయిల్ కుంభకోణం జరుగుతుందని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులకు సంబంధించి విచారణ చేయడంతో పాటు రికార్డింగ్ చేసినట్టు తెలిపారు. తదుపరి కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనంతరం సిడిఎంఎకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న రహదారి మలుపులు

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

మండలంలోని అంతర్గత రహదారుల్లో మలుపులు, ఇరువైపులా దట్టంగా పెరిగిన మొక్కలు వల్ల నిరంతరం ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా, అమాయకులైన ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవల్సి వస్తుంది. ముఖ్యంగా పార్వతీపురం మండలం కృష్ణపల్లి నుంచి పెదమరికి, చందలంగి మీదుగా ఒడిశా రాష్ట్రానికి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మరికి బండిదొరవలస మలుపులో మొక్కలు దట్టంగా పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీకొని ఐటిడిఎ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయిన సంఘటన జరిగింది. ఈ ప్రమాదం వల్ల నిండు గర్భిణీగా ఉన్న అతని భార్య, కుమారుడు అనాథులుగా మారిపోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన పరిస్థితి ఏర్పడింది. ఇలా నిత్యం పార్వతీపురం నుంచి పెదమరికి వైపుగా వెళ్లి వచ్చే వారు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని భయంతో ప్రయాణిస్తున్నారు. రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పొదలు, డొంకలు, చెట్లు వల్ల ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని రోజు ఎవరో ఒకరు ఆసుపత్రి పాలో అవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు, రూరల్ పోలీసులు, సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు



కృష్ణపల్లి నుంచి పెదమరికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రమాదకరమైన మలుపు

ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలు, చెట్లు, పిచ్చి మొక్కలు తక్షణమే తొలగించాలని, అలాగే వాహనదారులకు కనిపించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పాదాచారులు ద్విచక్ర వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని గంగాపురంలో గురువారం సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా పర్యావరణ దినోత్సవ సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను నియోజకవర్గ ఇన్చార్జిగా గ్రామానికి వచ్చినప్పుడు గంగాపురం ప్రజలు చూపిన ఆదరాభిమానాలు తనకు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. రోడ్లు, కాలువల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాల్లో గంగాపురానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టిడిపి నాయకులు బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, తానా తిరుపతినాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, సింహాచల నాయుడు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుష్పశ్రీవాణి, పరీక్షిత్ రాజును కలిసిన జిల్లా కో-ఆప్షన్ సభ్యులు

ప్రజాశక్తి – కురుపాం

వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణిని చినమేరంగిలో గల తన అతిథి గృహం వద్ద గురువారం జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా వారి ఆశీస్సులతో పదవి లభించినందుకు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్టు లతెఇపారు. శామని వారి సూచనలు, సలహాలు పాటిస్తూ వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైసిపి ప్రజా ప్రతినిధులు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

ముగిసిన ప్రతిష్ట మహోత్సవాలు

ప్రజాశక్తి –మక్కువ

మండలంలోని పెదఘాశిలలో మూడు రోజులుగా జరిగిన ఏడూళ్ల పోలమాంబ ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు కలశం ప్రతిష్ట, మహా అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కొండ పుట్టికి చెందిన మహిళలు అమ్మవారి గుడి వద్ద ప్రదర్శించిన కోలాటాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమానికి మండల వైసిపి అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు, కమిటీ సభ్యులు పెదగాసిల, కేంద్రుక గైసిల, పాత గైసిల, కాకుల వానివలస గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని కామన్నదొర వలసకు చెందిన బురిడి రామారావు పొలం పనులు చేస్తుండగా ట్రాక్టర్‌కు ఆనుకొని ఉన్న రోట్ వేటర్ (దుక్కిసెట్ పార్ట్) తగిలి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కామన్నదొరవలసలో మృతుడు బురిడి రామారావు తన పొలం దుక్కుదున్నే నిమిత్తం ట్రాక్టర్ని రప్పించుకున్నారని, ఆ ట్రాక్టర్ వెనుక ఉన్న రోటవేటర్‌కు ఉన్న మట్టి, గడ్డిని తీయమని ట్రాక్టర్ డ్రైవర్ చెప్పగా రామారావు రోటవేటర్ వెనుకున్నటువంటి గడ్డితీస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ బురిడి ఉమామహేశ్వరరావు నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా ట్రాక్టర్ని నడపడం వల్ల రోటవేటర్ బ్లేడ్లు రామారావు తల, చేయి, ఛాతి భాగానికి తగిలి తీవ్రగాయాలతో మృతి చెందారని పోలీసులు తెలిపారు. కుమారుడు తిలక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. రామరావు మృతి పట్ల కామన్నదొరవలస గ్రామస్తులతో పాటు సీతానగరం గ్రామస్తులు, వైసిపి నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.